# ఓడిపోయారు

మల్లాది వెంకట కృష్ణమూర్తి

శోభ ఒకటో నంబర్ బస్ సాప్ దగ్గర నుంచుని ఎదురుచూస్తున్న అరుంధతికి కుటుంబరావుని చూడగానే మొహం వికసించింది.

"డామిట్. ఇంత లేటా మరీనూ?" అన్నది చిరు కోపంగా.

"సారీ పై ఆఫీసర్ వదలలేదు. మామూలేగా" అన్నాడు కుటుంబరావు.

ఇద్దరూ సికింద్రాబాద్ స్టేషన్ వైపు నడవ సాగారు నెమ్మదిగా.

"ఏమిటి? ఇవాళ్ళ ఏదో సంగతి చెప్తానన్నావు?" అడిగాడు కుటుంబరావు నడుస్తూ.

"మీరు కూడా ఏదో చెప్తానన్నారుగా? ముందు మీ వంతు. తర్వాత నాది" అన్నది అరుంధతి

"ముందర మన స్థావరం చేరుకుందాం" అన్నాడు కుటుంబరావు.

ఇద్దరూ స్టేషన్ సమీపంలో వున్న ఆల్ఫ్స్ రెస్టారెంట్‌లోకి వెళ్ళారు ఎప్పటిలాగానే ఓ మూలగా కూర్చున్నారు, దూరంగా.

"నిన్ను చూసి వారం రోజులు దాటుతోంది" అన్నాడు కుటుంబరావు అరుంధతి వంక చూసి.

"అవును. ఏం చేస్తాం? ఆదివారం తప్పితే మనకి ఎప్పుడూ కుదరదుగా కలుసుకోడానికి" అన్నది అరుంధతి నవ్వి.

"ఎప్పుడూ కలుసుకునేలా ఏర్పాటు చేసుకుందామా" అడిగాడు కుటుంబరావు.

"ఎలా- వుద్యోగాలు మానేద్దామా?"

సర్వర్ వచ్చాడు. పాట్ కాఫీకి ఆర్డర్ ఇచ్చాడు కుటుంబరావు.

"ఇందాక ఏదో చెప్తున్నారు?" అన్నది అరుంధతి సర్వర్ వెళ్ళగానే.

"అవును. మనిద్దరం త్వరలో ఓ నిర్ణయానికి రావటం మంచిది" అన్నాడు కుటుంబరావు.

"ఏ నిర్ణయం?" అడిగింది అరుంధతి.

"పెళ్ళి"

"గుడ్ అయిడియా"

"ఎన్నాళ్ళు ఇలా విడిగా? పెళ్ళి చేసేసుకుందాము."

సర్వర్ ట్రే తీసుకువచ్చి టేబిల్ మీద పెట్టాడు. కుటుంబరావు రెండు ఖాళీ కప్పులోకి వేడివేడి డికాషన్ ఒంచాడు మూడు వంతులు. నాలుగో వంతు పాలుపోశాడు- ట్రేలోని మరో కెటిల్‌లోంచి చక్కెర వేసి కలియపెట్టి ఒకటి అరుంధతి వైపు జరిపాడు.

"మీ ఇంట్లో మన సంగతి తెలుసుగా?"

"చూచాయనా తెలుసు"

"ఇష్టమేగా?

"ఇష్టమే"

"గుడ్ మళ్ళీ ఆదివారం కలుసుకున్నప్పుడు మిగతా విషయాలు మాట్లాడుకుందాం. సినిమాకి టైం అవుతోంది."

పావుగంట తర్వాత ఇద్దరూ లేచారు.

* * *

ఊరికే సరదాగా స్నేహం చేశాడు కుటుంబరావు అరుంధతితో. క్రమంగా స్నేహం పెరిగి ప్రేమగా రూపొందింది. అరుంధతి బాగా నచ్చింది కుటుంబరావుకి. కాని తనని నిజంగా ప్రేమిస్తోందా. లేదా అన్నదే కుటుంబరావు భయం.

మంగళవారంనాడు రాత్రి వుత్తరం రాయడానికే నిశ్చయించుకున్నాడు కుటుంబరావు. పెళ్ళి సంగతి ఆదివారం అరుంధతితో ప్రస్తావించి నప్పటి నుంచీ ఆలోచనలతో సతమతమవుతున్నాడు

అరుంధతి నిజంగా తనని ప్రేమిస్తోందా లేదా తన జీవిస్ని, హోదానా?

రాత్రి పడుకోబోయేముందు ఉత్తరం మొదలెటాడు.

డియర్ అరు

మొన్న ఆదివారం మనిద్దరం వివాహం చేసుకోవాలనే నిర్ణయానికి వచ్చాము నాకు చాలా సంతోషంగా వుంది.

నన్ను పెళ్ళి చేసుకుని నా జీవితంలో భాగస్వామ్యం పంచుకునే నీకు కొన్ని సంగతులు. ముఖ్యమైనవి. తెలియచేయటం నా కర్తవ్యం. ఈ సంగతులు ఇప్పటివరకూ నీకు చెప్పకపోవటానికి కారణం, వాటి ప్రసక్తి రాకపోవటమే.

మాది మధ్యతరగతి కుటుంబం. నా ఆస్తి అంతా కలిపి నేనుంటున్న ఓ చిన్న యిల్లు, చాలా పెద్ద కుటుంబం మాది. నాకు ఇద్దరు అక్కయ్యలు, ముగ్గురు చెల్లెళ్ళు వున్నారన్న సంగతి నీకు తెలియదనుకుంటాను. అక్కయ్యలిద్దరికీ పెళ్ళిళ్ళయి పోయాయి, కాని మా రెండో బావగారు ప్రమాదంలో రెండు సంవత్సరాల క్రితం చచ్చిపోయాడు. రెండో అక్కయ్యకి ఇద్దరు పిల్లలు. నా దగ్గరే వుంటుంది ఎవరూ అత్తింటివైపు వాళ్ళు లేకపోవటం వల్ల.

ముగ్గురు చెల్లెళ్ళలో ఎవరికీ పెళ్ళి కాలేదు ఆ బాధ్యత కూడా నామీదే వుంది అమ్మకి పక్షవాతం. అందరికీ పెళ్ళయి వెళ్ళిపోతే కోడలే చూడాలి ఆమెని. అది ధర్మం కదూ?

నా ఆర్థిక బాధలు, కుటుంబ విషయాలు ముందరే తెలియచేయడం మంచిదని ఈ వుత్తరం రాస్తున్నాను. ఇక ఇప్పుడు నీ ఇష్టం. నువ్వు తెలియచేయాలి నన్ను ఒప్పుకునేదీ లేనిదీ. అయినా మన ప్రేమకి ఇవేమీ ఆటంకం కావనుకుంటాను.

సమాధానం రాయి. లేదా ఫోన్ చేసి చెప్పు. లేదా మళ్ళీ ఆదివారం మనం కలుసుకున్నప్పుడు నీ నిర్ణయం తెలియచేయి.

లవ్,

కుటుంబరావు

ఉత్తరం మళ్ళీ మొదటినుంచి చదివి అక్కడక్కడా అక్షరాలు దిద్దాడు. రెండు చోట్ల మరిచిపోయిన తలకట్టులు సరి చేశాడు.



కవరుమీద అరుంధతి ఎడ్రసు రాసి. వుత్తరం కవరులో పెట్టి. అతికించి ఆలోచిస్తూ పడుకున్నాడు. ఆ రోజు మంగళవారం. మర్నాడు బుధవారం పోస్ చేస్తే గురువారం అందుతుంది అరుంధతికి.

అరుంధతి నిజంగా తనని ప్రేమించి వుంటే, నిజంగా తన జీతాన్ని కాక తనంటే మనస్ఫూర్తిగా ఇష్టపడతే. తప్పకుండా పెళ్ళిచేసుకోడానికి ఒప్పుకుంటుంది.

మర్నాడు ఆఫీసుకు వెళుతూ వుత్తరం పోస్ట్ చేశాడు కుటుంబరావు. మధ్యాహ్నం ఎక్స్‌ప్రెస్ డెలివరీలో ఒక వుత్తరం వచ్చింది కుటుంబరావుకి. సంతకం పెట్టి వుత్తరం అందుకుని చింపి చదివాడు.

కాగితం మీద నీట్‌గా టైప్‌చేసి వుంది వుత్తరం. అరుంధతి నుంచి-ఏం రాసిందో వని గబగబా చదివాడు.

డియరెస్ట్ కుటుంబరావ్.

మొన్న ఆదివారం పెళ్ళి సంగతి మాట్లాడినప్పుడే వెంటనే చెప్దామనుకున్నాను. కాని చెప్పలేకపోయాను. మీకు తెలియచేయటం మంచిదని ఈ వుత్తరం రాస్తున్నాను.

నాగురించికానీ- మా ఇంటి సంగతులు గానీ చెప్పలేదు మీకెప్పుడూ పెళ్ళయ్యే దాకా చెప్పకుండా వుంటే నేనే కావాలని ఈ సంగతులు దాచానని మీకు కోపం రావచ్చు.

ఇంతవరకు మా అక్కయ్యకి పెళ్ళి కాలేదు. నడవలేదు. కుడికాలు మోకాలు దాకా లేదు. అక్కయ్య ఏదయినా ఆశ్రమంలో చేరుదామని ప్రయత్నించింది కాని నేనే బలవంతంగా మానిపించాను. ఎందుకంటే నాకు అక్కయ్యే సర్వస్వం.

అమ్మ పోయి రెండేళ్ళు దాటుతున్నా. అమ్మ రోగం నయం చేసేందుకు చేసిన అప్పు తరగలేదు సరికదా పెరిగింది. వడ్డీ కూడా కలిపి ఇప్పుడు నాలుగువేల చిల్లర అమ్మకి గుర్తుగా మిగిలి వుంది.

ప్రతి నెలా నా జీతంలోంచి కొంత భాగం ఆ అప్పుకింద జమ కడుతున్నాను. ఆ మార్వాడీ అంటేనే నాకు భయం. అసహ్యం. మన పెళ్ళయ్యాక నా జీతం మొత్తం ఆ అప్పుకింద కడదామని వుంది. కట్నం ఇవ్వలేకపోయినా ఈ బాధ్యతలతో. బరువులతో వస్తాను మీ ఇంటికి.

దయచేసి ఆలోచించండి. మీ నిర్ణయంలో ఎలాంటి మార్పూ వుండదనే విశ్వసిస్తున్నాను. ఆదివారం మిగతా సంగతులు.

మీ

—అరుంధతి.

ఉత్తరం మడిచి. కవరులో పెట్టి. కవరు జేబులో పెట్టుకున్నాడు కుటుంబరావు. సిగరెట్ వెలిగించాడు.

# ఓడిపోయారు

అసలు రంగు బయటపడింది ఇన్నాళ్ళ తననుంచి ఎందుకు దాచిందో సంగతులన్నీ! తనని ప్రేమించలేదు. తన నాలుగంకెల జీతాన్ని చూసి ప్రేమించింది పెళ్ళవుతే అప్పు తనే తీరుస్తాడనీ, కుంటి అక్కయ్య బాధ్యత తనమీద వేసుకుంటాడనీ ఆశపడ్డది. కుటుంబరావును కాదు కుటుంబరావు బేంక్ బేలన్స్‌ని అరుంధతి ప్రేమించింది.

ఆ దివారం అరుంధతిని కలుసుకున్నప్పుడు తన మనస్సు మార్చుకున్నట్లుగా చెప్పేయదలచుకున్నాడు కుటుంబరావు. సిగరెట్ ఏష్‌ట్రేలో పడేశాడు.

ఆదివారంనాడు సాయంత్రం నాలుగు గంటలకి తొంభై ఒకటో నంబరు బస్ స్టాప్ దగ్గర ఎదురుచూస్తోంది. అరుంధతి.

ఆటోరిక్షా నుంచి దిగుతున్న కుటుంబరావును చూసి నవ్వుతూ అడిగింది అరుంధతి:

"ఇవ్వాళ కూడా ఆఫీస్‌కి వెళ్ళారా!"

"అవును. ఆడిటింగ్ జరుగుతోంది. అందరం వెళ్ళాల్సొచ్చింది." చెప్పాడు.

ఇద్దరూ సికింద్రాబాద్ స్టేషన్ దగ్గర వున్న ఆల్ఫ్సా రెస్టారెంట్ వైపు నడవసాగారు ఎవరి ఆలోచనలలో వాళ్ళున్నారు కొంచెం దూరం వెళ్ళిన తర్వాత అరుంధతే అడిగింది కుటుంబరావుని.

"నేను రాసిన వుత్తరం అందిందా."

"అందింది. పూర్తిగా చదివాను. సమాధానం చెప్పాడు కుటుంబరావు

ఇద్దరూ రెస్టారెంట్‌లోకి వెళ్ళి ఎప్పుడూ కూర్చునే చోట కూర్చున్నారు హాట్ కాఫీకి ఆర్డరిచ్చాడు కుటుంబరావు. ఎప్పటి మాదిరిగానే.

"మనం మళ్ళీ ఇప్పుడు జాగ్రత్తగా ఆలోచించి ఓ నిర్ణయానికి రావడం మంచిది" అన్నాడు కుటుంబరావు.

'అవును' అన్నది అరుంధతి చీరకొంగు వేలికి మెలిపెడుతూ.

"మనిద్దరం చర్చించి ఏవిధంగా చేస్తే ఇద్దరికీ లాభదాయకమో అలా చేయటం మంచిది. మనకి సమస్యలున్నాయి ఇప్పుడు వాటిని గురించి ఆలోచించాలి ప్రేమ గురించి కాదు "

అరుంధతి మౌనంగా వుండిపోయింది.

"నా ఉత్తరంలో రాశాను. నాకున్న బరువు బాధ్యతలు పూర్తిగా అర్థం అయాయిగా?'

"అయాయి '

సర్వర్ కాఫీకి కావలసిన సరంజామా తీసుకువచ్చాడు ట్రేలో కుటుంబరావు కాఫీ కలిపాడు రెండు కప్పుల్లో ఒక కప్పు అరుంధతికి అందించి అన్నాడు.

"నాకూ చాలా బాధ్యత వుంది నీకూ వుంది. అవి తీరాలంటే డబ్బు కావాలి. ఆలోచిస్తే, మనిద్దరం పెళ్ళి చేసుకుంటే మనకి మిగిలేది బాధలు తప్ప సుఖం కాదు "

కాఫీ తాగుతూ జాగ్రత్తగా కుటుంబరావు మాటలు అవగాహన చేసుకుంటోంది అరుంధతి.

"నా వుద్దేశం ప్రేమకన్నా ముఖ్యమయినది డబ్బుకి ఇబ్బందిపడకపోవటం, మన పెళ్ళివల్ల డబ్బు ఇబ్బంది తప్ప మనకి మరేమీ దక్కదు. ప్రేమ వుండదు అప్పుడు. పూర్తిగా ఇంకి, ఎండిపోతుంది. అటు నీ అప్పు తీర్చాలి. చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు చేయాలి—అక్కయ్య కుటుంబాన్ని పోషించాలి."

కాఫీ అయిపోగానే కుటుంబరావు


సేవింగ్స్ ద్వారా.... మీ భద్రతకు ఆసక్తి కలిగి వున్నారు.

## ఆంధ్రా బ్యాంక్

పన్ను రాయితీలతో
మీకు ఆకర్షణీయమైన వడ్డీ చెల్లిస్తుంది.

సేవింగ్స్ బ్యాంక్, రికరింగ్ డిపాజిట్స్, కిడ్డీ బ్యాంక్ స్కీము—
ఆంధ్రా బ్యాంక్ అనేక ఆకర్షణీయ సేవింగ్స్ స్కీములు కలిగి వున్నది.

మీరు ఏ వయస్సు వారైనా లేక మీ వృత్తి ఏదైనా మీ భవిష్యత్తును సురక్షితంగా చేసేందుకు మరియు ఆకర్షణీయమైన సంపాదనలతో

పన్ను రాయితీలతో
భవిష్యత్తు కొరకు ఆదా చేయండి. మీ సొమ్ము పెంచండి....

## ది ఆంధ్రా బ్యాంక్ లిమిటెడ్

సెంట్రల్ ఆఫీసు:
సుల్తాన్ బజార్: హైదరాబాద్.

మాట్లాడటం. ఆపి మళ్ళీ కాఫీ కలుపుకున్నాడు, తన కప్పులో.

"అయితే ఏం చెయ్యాలి మనం?" అడిగింది అరుంధతి.

"నీకు ఏం చెయ్యాలనిపిస్తోంది?"

"అంటే?"

"పెళ్ళి చేసుకోవాలనా, వద్దనా?"

"అవి మీరే నిర్ణయించాలి."

కొన్ని క్షణాలు మౌనంగా వుండిపోయాడు కుటుంబరావు. అరుంధతి కళ్ళలోకి చూస్తూ అన్నాడు:

"నీ మీద ప్రేమ లేదనుకోవడం కష్టం.వుంది. అయినా విడిపోవటమే మంచిదనుకుంటాను."

"అంటే పెళ్ళి చేసుకోకపోవటమా?" అడిగింది అరుంధతి.

"అవును."

జేబులోంచి సిగరెట్ పాకెట్, లైటర్ తీసి మళ్ళీ జేబులో వేసుకున్నాడు కుటుంబరావు రెండటినీ-సిగరెట్ వెలిగించకుండా.

"వెధవది.ఎర్ కండిషన్ రెస్టారెంట్స్‌కి వస్తే ఇదే బాధ. సిగరెట్ తాగేందుకు వీలులేదు లోపల" అన్నాడు విసుగ్గా.

అరుంధతి కొన్నిక్షణాలు కుటుంబరావు ముఖంలోకి చూసి అంది:

"ఆల్ రైట్. విడిపోదాం- అదే మంచిదయితే."

ఆమాటలు వినగానే రిలీఫ్‌గా ఫీలయ్యాడు కుటుంబరావు. ప్లేట్‌లో బిల్ తీసుకు వచ్చాడు సర్వర్.

హేండ్ బేగ్ తెరిచింది అరుంధతి.

జేబులోంచి అయిదు రూపాయలనోటు తీసి ప్లేట్‌లో పడేశాడు కుటుంబరావు సర్వర్ ప్లేట్ తీసుకుని వెళ్ళిపోగానే హేండ్ బేగ్‌లోంచి అయిదు రూపాయల నోటు తీసి అందిచ్చింది అరుంధతి.

"నో. నన్నే ఇవ్వనివ్వు; ఇదే ఆఖరిసారిగా మనం కలసి మళ్ళీ రాం కదా"

కుటుంబరావు తిరిగి ఇచ్చేశాడు డబ్బు అరుంధతికి.

"మీ చెల్లెళ్ళ పెళ్ళిళ్ళు చేసి మీరుకూడా త్వరగా పెళ్ళి చేసుకోండి" అన్నది అరుంధతి

"వీలయినంత త్వరలో అప్పు తీర్చేసి నువ్వు కూడా పెళ్ళి చేసేసుకో" అన్నాడు కుటుంబరావు నవ్వి.

* * *

"అక్కడ నుంచుని వుంది ఎవరు? అరుంధతి కదూ?" అడిగాడు కుటుంబరావు తన స్నేహితుడిని. దూరంగా పెళ్ళి పందిరిలో నుంచుని పెళ్ళి చూస్తున్న ఓ యువతిని చూపిస్తూ.

"అవును. నీకు తెలుసా?" అడిగాడు స్నేహితుడు.

"తెలుసు. ఏం చేస్తోంది?" అడిగాడు కుటుంబరావు.

"కాపరం."

"పెళ్ళయిందా?"

"నాలుగేళ్ళు దాటుతోంది అయి. మా పెదనాన్న కూతురు."

"వాళ్ళక్కయ్య కూడా వచ్చిందా?"

"అక్కయ్య అసలులేదు అరుంధతికి."

"వుండు. పాపం కుంటిది."

"నీకు బాగా తెలుసా. నాకు తెలుసా? అరుంధతికి అక్కయ్యలు లేరు ఎవరూ"

"లేదు నాకు బాగా తెలుసు. ఆ పక్కన వున్నది ఎవరు? అరుంధతి పోలికలు వున్నాయి బాగా"

"అరుంధతి అమ్మ."

"అమ్మ!"

"అవును. తెల్లబోతావెందుకు?"

"ఆవిడ బ్రతికే వుందా?"

"ఇవాళ ఏదో అయింది నీకు?"

నవ్వాడు కుటుంబరావు స్నేహితుడు.

"పలకరించి వస్తాను."

అరుంధతి దగ్గరికి వెళ్ళాడు కుటుంబరావు

"మీరా? పెళ్ళయిందా? కులాసా? అడిగింది అరుంధతి నవ్వుతూ, కుటుంబరావుని చూసి.

"పెళ్ళి పందిరిలోంచి అలా బయటకి వెళదాం" అన్నాడు కుటుంబరావు.

"ఒక్క నిముషం. గంధం గిన్నె ఎవరికయినా ఇచ్చి వస్తాను.బయట ఉండండి."

సరిగా నిముషం తర్వాత వచ్చి కలిసింది అరుంధతి కుటుంబరావుని. అరుంధతి చెయ్యి పట్టుకుని అడిగాడు కుటుంబరావు.

"నీకు అక్కయ్య లేదుటగా? మీ అమ్మ బ్రతికే వుందిటగా? నిజమా?"

"చాలా విచిత్రంగా కలుసుకున్నాం కదూ? పెళ్ళికూతురు వైపా? పెళ్ళికొడుకు వైపా?"

చెయ్యి విడిపించుకుని నవ్వింది అరుంధతి.

"నో కిడ్డింగ్. ఎందుకు అబద్ధం ఆడావు? చెప్పు."

"నిజం చెప్పనా?"

"చెప్పు"

"ఓడిపోయారు మీరు."

"ఏమిటి?"

"అవును. నిజంగా ఓడిపోయారు మీరు."

ఏమిటి? ఎలా?"

"పరీక్షలో"

"ఏం పరీక్ష?"

"ప్రేమ పరీక్ష అందాం కాసేపు. మిమ్మల్ని వివాహం చేసుకోడానికి పూర్తిగా ఇష్టపడ్డాను. కాని నిజంగా మీరు నన్ను ప్రేమించారో. లేక నా జీతాన్ని ప్రేమించారో తేల్చుకోలేకపోయాను. ఉద్యోగం చేస్తూ నెలకి మూడు వందలు సంపాదించే ఆడదాన్ని చాలా మంది ప్రేమిస్తారు. అదే వుద్యోగం లేకపోతే వెనకా ముందూ ఆడతారు.

"అర్థమయింది. ఇక చెప్పక. అప్పు వుందని అబద్ధం ఆడావు, జీతాన్ని ప్రేమించిన వాడి అసలు రంగు బయటపడుతుంది. అవునా?"

"అవును. మీరు ఒప్పుకుంటే పెళ్ళికి సిద్ధపడేదాన్ని నేను. మీ బాధ్యతల గురించి తెలిసి కూడా ఇద్దరి జీతాలు కలిపితే హాయిగా బ్రతకగలమని నాకు అప్పుడే తెలుసు."

"ఓడిపోయాను" అన్నాడు కుటుంబరావు.

"పెళ్ళయిందా?" అడిగింది అరుంధతి.

"అయింది" చెప్పాడు.

"మీ చెల్లెళ్ళకి?"

"ముగ్గురికీ అయింది. చివరిదాన్ని ఓ డాక్టర్ కట్నం లేకుండా చేసుకున్నాడు ప్రేమించి, ఆగి అరుంధతి వంక చూసి అన్నాడు.

"నువ్వలా అబద్ధం ఆడకుండా వుంటే మనిద్దరికీ పెళ్ళయిపోయేది ఈపాటికి."

కుడిచేత్తో మెళ్ళోని మంగళసూత్రం చూపిస్తూ అన్నది అరుంధతి.

"నాకు పెళ్ళయిపోయింది. మీరలా మాట్లాడితేనాకు అసహ్యంగా వుంటుంది."

అరుంధతి పెళ్ళి పందిరిలోకి వెళ్ళిపోయింది. సిగరెట్ వెలిగించి చిన్నగా నవ్వుకున్నాడు కుటుంబరావు తనలో తను.

అరుంధతి కూడా ఓడిపోయింది! ఆడది కాబట్టి బయటపడిపోయింది. తను నిజం చెప్పలేదు. ఆడిన అబద్ధాన్ని నిజంగానే వుంచాడు అరుంధతి దృష్టిలో తనుకూడా.

ఇద్దరూ ఓడిపోయారు.

★